క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఆహ్వానం

దుత్తలూరు: నర్రవాడలో ఈ నెల 15 నుంచి జరగనున్న వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆహ్వానం పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో వెంకయ్యనాయుడును కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు.

ఎన్‌ఎంయూఏ కార్మికుల నిరసన



ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి మంగళవారం వేకువజామున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌ఎంయూఏ ఉద్యోగులపై ఉదయగిరి డిపో మేనేజర్ పక్షపాత వైఖరిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలని, అనారోగ్యానికి గురైన ఉద్యోగులను ఆర్టీసీ డిస్పెన్సరీకి పంపి వైద్యసేవలందించాలని కోరారు. ఆత్మకూరు డిపో గ్యారేజీ కార్యదర్శి కిషోర్‌బాబు అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కాశీవిశ్వనాథ్, వెంకటేశ్వర్లు, శివకుమార్, రాములు,శంకర్, ఎం.వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కలను నివారించాలని వినతి

ఉదయగిరి: పట్టణంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లాకు టీడీపీ నాయకుడు గాజుల షర్ఫుద్దీన్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. కుక్కలు, కోతుల బెడదతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయట తిరగాలంటే భయాందోళనలకు గురవుతున్నారన్నారు. కోతులు ఇళ్లలోకి దూరి బీభత్సం చేస్తున్నాయని విన్నవించారు.

ఆధార్ నమోదుకు పాట్లు

ఆత్మకూరురూరల్: పట్టణంతో పాటు మండల ప్రజలు ఆధార్ నమోదుకు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో నెల్లూరుపాళెం, నారంపేట, బట్టేపాడు సచివాలయాలు, ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలో ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మీసేవ కేంద్రాల్లో ఆధార్ సేవలను నిలిపివేసిన నేపథ్యంలో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేవి. ప్రస్తుతం ఏ కేంద్రంలో కూడా ఆధార్ సేవలు అందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంజయ్య మృతికి నివాళి

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకునూరి అనంతయ్య తండ్రి అంజయ్య మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మండల వైఎస్సార్‌సీపీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. అంజయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మందలపు తిరుపతినాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, నాయకులు జక్కం శ్రీనివాసులురెడ్డి, బత్తిన కొండమ్మ, ఉదయగిరి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎరగూటి చెంచురెడ్డి, పెండ్యాల తిరుపతయ్య ఉన్నారు.

డీసీపల్లిలో 508 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 508 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 669 బేళ్లు రాగా, 508 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.190, సరాసరిన రూ.233.35 ధర పలికిందని వివరించారు. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

కావలి అభివృద్ధికి కృషి



కావలి (జలదంకి): కావలి పట్టణాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కావలిలోని దొడ్ల మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో పురప్రముఖులకు ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై మంగళవారం ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కావలిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కావలి రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు రూ.38 లక్షలతో పనులను చేపట్టామని తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఎంపీ నిధులు రూ.44 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. అమృత్ 2.0కు సంబంధించి రూ.15.26 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

కావలి(జలదంకి): కావలి మండలం బాలకృష్ణారెడ్డినగర్ సమీపంలో పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కావలి రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ముగ్గురు జూదరులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టులో హాజరుపరచనున్నట్లు రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి తెలిపారు.

కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడో?

- ఇప్పటి వరకు ఒక్కటి కూడా మంజూరు చేయని ప్రభుత్వం
- కనీసం దరఖాస్తులను స్వీకరించని వైనం
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ తెరుచుకుంటే చెబుతామంటున్న అధికారులు
- ఉదయగిరి నియోజకవర్గంలో 3వేల మందికిపైగా ఎదురుచూపులు



జలదంకి మండల పరిషత్ కార్యాలయం

జలదంకి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్‌ను మంజూరు చేయలేదు. కొత్తవి మంజూరు చేయకపోగా ఉన్న వాటిలో కోత విధించే పనిలో ఉంది. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని, తెరుచుకోగానే చెబుతామని తిప్పి పంపుతున్నారు. దీంతో ఎప్పుడు వెబ్‌సైట్ తెరుచుకుంటుందా..దరఖాస్తు చేసుకుందామా అని అర్హులైన వారు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే పింఛన్ మంజూరు చేసేవారు. వితంతు పింఛన్ అయితే మరింత వేగంగా మంజూరయ్యేది. భర్త చనిపోయిన వెంటనే డెత్ సర్టిఫికెట్‌ను సచివాలయంలో అందజేస్తే పింఛన్ మంజూరు చేసేవారు. ఇదంతా 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు ఉన్న పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరయ్యాయి.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోలేదు. భర్త చనిపోయి ఏడాది అవుతున్నా వితంతు పింఛన్లు మంజూరుకాక ఉదయగిరి నియోజకవర్గంలో వందల సంఖ్యలో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వృద్ధులు కూడా అల్లాడుతున్నారు. పింఛన్ వస్తే కనీసం మందుల ఖర్చులకు అయినా ఎవరిపైనా ఆధారపడాల్సిన పని ఉండదని వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఆ హామీ గురించి అసలు ఆలోచన చేయడం లేదు.

సచివాలయ చుట్టూ ప్రదక్షిణలు

ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో దాదాపు మూడు వేల మందికిపైగా అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వీరంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులను సైతం ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్‌కావడం కాలేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదంతా వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ప్రతినెలా మొదట్లోనే కొత్త పింఛన్లు అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఏ ఆదేశాలు లేకుండా దరఖాస్తులు స్వీకరించలేమని అర్హిదారులకు చెప్పి పంపిస్తున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్‌లో లేదు

కొత్త పింఛనకు దరఖాస్తునకు సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. సచివాలయంలో దరఖాస్తు ఇస్తే పేర్లు నమోదు చేస్తారు. పాత పింఛన్ల పరిశీలన పూర్తయిన తరువాత కొత్త వాటికి అవకాశం ఉంటుంది. కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత దరఖాస్తులను పరిశీలించి సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ అయిన తరువాత అందులో నమోదు చేసి కొత్తవి అందజేస్తాం.

– బ్రహ్మయ్య, ఎంపీడీఓ, జలదంకి

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి/దుత్తలూరు/వరికుంటపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరిలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు వింజమూరు ఎన్నికల సభలో ఉదయగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, వింజమూరులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం, ఉదయగిరిలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీల ఊసే లేదన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోని వాటిని నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. సహజ వనరులను కొల్లగొడుతున్నా పట్టించుకునేనాథుడే లేడన్నారు.ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను ప్రశ్నించే గొంతులను పోలీసులు ద్వారా అణచివేస్తూ దుర్మార్గ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ ఏడాది కాలంలో రాష్ట్రంలోని అరాచకాలు, అన్యాయాలు, అక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెన్నుపోటు దినం పేరుతో ఉదయం 10 గంటలకు నిరసన ర్యాలీ చేపడుతున్నామని తెలిపారకు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా ఉదయగిరిలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని దుత్తలూరు జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనరు మందలపు తిరుపతినాయుడు వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు.

నేడు వెన్నుపోటు దినం ర్యాలీ

ఆత్మకూరు/మర్రిపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలను పూర్తి చేసుకుంటున్న క్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్‌నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు జరిగే భారీ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఆత్మకూరులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

వెన్నుపోటు దినానికి తరలిరండి

అల్లూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం కావలిలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి అల్లూరు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలం సాయికుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు కావలికి చేరుకోవాలని కోరారు.

ఎరువుల యాజమాన్యం కీలకం



కలిగిరి: మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేశ్వరరావు

కలిగిరి: భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని హైదరాబాద్‌లోని భారతీయ వరి పరిశోధన స్థానానికి చెందిన మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు రైతులకు సూచించారు. వెలగపాడు పంచాయతీ పరిధిలోని కొత్తూరులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవీకే నాగేశ్వరరావు పాల్గొని నువ్వుల సాగులోని యాజమాన్య పద్ధతులు, పచ్చిరొట్ట పంటల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త కే కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఓ సురేష్‌బాబు, వీఏఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జలదంకి: చామదలలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో నెల్లూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త లోకేష్‌బాబు, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జీ శివన్నారాయణ పాల్గొన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటల రకాలు, సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఏఓ శైలజ, వీఏఏలు పాల్గొన్నారు.

జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చిరుధాన్యాలతో ఉపాధి పొందడంపై అవగాహన కల్పించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వినీత మహిళలు ఇంటివద్దే ఉంటూ కుటీర పరిశ్రమలు నిర్వహిస్తూ అదనపు ఆదాయాన్ని ఎలా పొందవచ్చో అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుజాత, ఏడీఏ చంద్రభాను,ఏఓ శ్రీహరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు బాధ్యతగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ

ఉదయగిరి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఉదయగిరి ఐసీడీఎస్ సీడీపీఓ సునీత అన్నారు. ఉదయగిరిలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసినందున కేంద్రాలను శుభ్రపరిచి చిన్నారులు ఆకర్షించేలా తీర్చిదిద్దాలన్నారు. కేంద్రాల పరిధిలోని ప్రీస్కూల్ చిన్నారులను నమోదు చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. కేంద్రాల నిర్వాహణలో అలసత్వ వహిస్తే చర్యలు తప్పవన్నారు. సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాలను తనిఖీలు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు తేజస్విని, షాను, తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి పరామర్శ



ముర్తుజాను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉదయగిరి ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముర్తుజాహుస్సేన్‌ను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా ముర్తుజాహుస్సేన్‌ను పరామర్శించారు. ప్రమాద ఘటనలో గాయపడిన మరో వ్యక్తి సందాని, లక్‌పతిలను కూడా పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జీ ఓబుల్‌రెడ్డి, సోమిరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎస్దాని, షేక్.అలీఅహ్మద్, తిరుపతినాయుడు, తదితరులున్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన అవసరం



సంగంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



కలిగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

సంగం: కీటక జనిత వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలీ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సంగంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ కేసులను గుర్తించి నిక్షయ్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. డాక్టర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ జ్వరం కేసులను ఆర్డీటీ కిట్ ద్వారా పరీక్షించి పీహెచ్‌సీకి పంపించాలని పారామెడికల్ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య, ఆశవలంటీర్లు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే

కలిగిరి: ప్రజలు అధికారుల సూచనలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియాను అంతం చేయవచ్చని వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. కలిగిరిలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులు--నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, లెప్రసీ అధికారి శ్రీనివాసులు, సీహెచ్ఓ సాయిలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు చెన్నై శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వై రఘురామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు చేస్తారని చెప్పారు. ఆపరేషన్ చేయించుకున్న రెండు గంటల్లోనే ఇళ్లకు పంపడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారు ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. వింజమూరు పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రాహ్మణక్రాకలో దొంగలు హల్‌చల్

- ఐదు దేవాలయాల్లో చోరీ



సాయిబాబా మందిరంలో ఆధారాలను సేకరిస్తున్న కలిగిరి సీఐ, ఎస్సైలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని సాయినాథుని, బ్రహ్మంగారి మందిరాలు, పోలేరమ్మ, గంగమ్మ, శివాలయాల్లోని హుండీలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఆయా ఆలయాల అర్చకులు హుండీలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. హుండీల్లో దాదాపు రూ. 15 వేల వరకు నగదు ఉండవచ్చని తెలిపారు. దీంతో కలిగిరి సర్కిల్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై లతీఫున్నీసా ఆలయాలను పరిశీలించారు. గ్రామస్తులు, అర్చకులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఎస్సై మాట్లాడుతూ దొంగలు కేవలం హుండీలను మాత్రమే పగులగొట్టారని, విగ్రహాలు, ఆభరణాల జోలికి వెళ్లలేదని తెలిపారు. మద్యం తాగే వ్యక్తులే చోరీలకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శివ కల్పన

ఉదయగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులు శివకల్పన, వినీత సూచించారు. స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ గదిలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం సెక్టార్‌వారీగా నెలసరి నివేదికలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీహెచ్ఓ శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ , తదితరులు పాల్గొన్నారు.

ఎన్వీకండ్రికలో భూ వివాదం

- రెండు తరాలుగా భూములను సాగుచేసుకుంటున్న రైతులు
- టీడీపీ నాయకుల ప్రోద్బలంతో..
- అప్పట్లో విక్రయించినవి చెల్లవని వారసుల మెలిక
- ఆర్డీఓను ఆశ్రయించిన బాధిత రైతులు



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట పాసుపుస్తకాలను చూపుతున్న బాధిత రైతులు



రెవెన్యూ కోర్టులో రైతులను విచారిస్తున్న ఆర్డీఓ పావని

చేజర్ల(ఆత్మకూరు): 80 ఏళ్ల క్రితం ఆ భూములను కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్లు సైతం చేయించుకున్నారు. రెండు తరాలుగా సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇటీవల కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో రంగంలోకి దిగారు. సదరు భూములను అమ్మిన వారి వారసులమని, వారసత్వం కింద అవి మావేనని, అప్పటి అమ్మకాలు చెల్లబోవని రైతులతో వాగ్వాదానికి దిగుతున్నారు. బాధిత రైతుల వివరాల మేరకు..చేజర్ల మండలం ఎన్వీకండ్రిక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 98–సీలో 742.97 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని కొన్ని దశాబ్దాల క్రితం రెండు, మూడు కుటుంబాల వారు స్థానికులకు అమ్మేశారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు సైతం వెంకటగిరిలో జరిగాయి. ఈ భూములకు 1974లో రెవెన్యూ పట్టాలు సైతం ఇచ్చారు. సుమారు 150 కుటుంబాల వారు భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2010లో కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో భూములు వారసత్వంగా తమకు చెందుతాయని జంజాల ఈశ్వరయ్య మనవళ్లుగా చెప్పుకుంటూ వీరాచారి, కృష్ణప్రసాద్, రామ్మోహన్, ఈశ్వరమ్మ తెరమీదకు వచ్చారు. భూములను సాగుచేసుకుంటున్న రైతులను అడ్డుకున్నారు. అప్పట్లో ఇరువర్గాల వారు అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే వారసులమని చెప్పుకునే వారు వీఆర్వో, ఆర్డీఓ సంతకాలను సైతం ఫోర్జరీ చేసి కొన్ని దొంగ పట్టాలు సృష్టించి నకిలీ పాసుపుస్తకాలు తయారు చేశారు. ఈ విషయాలను అప్పటి జాయింట్ కలెక్టర్ సౌరభ్ గౌర్ దృష్టికి బాధిత రైతులు తీసుకెళ్లారు. కలెక్టరేట్‌లో జరిగిన రెవెన్యూ కోర్టులో వారసత్వం అని చెప్పుకునేవారికి భూములు దక్కవని, 80 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన వారివే అసలైన పట్టాలు అని, దొంగ పాసుపుస్తకాలు తయారు చేయించిన అప్పటి తహసీల్దార్ అప్పారావును సస్పెండ్ చేశారు. అనంతరం వారసత్వంగా చెప్పుకునే వారు హైకోర్టు సింగిల్ బెంచ్‌లో అప్పీలు చేశారు. అక్కడ సైతం కేసును కొట్టివేశారు. అనంతరం త్రిసభ్య బెంచ్‌కు అప్పీలు చేయగా ప్రస్తుతం వ్యవహారం కోర్టులో నడుస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల మండల టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో స్థానికంగా ఉండే టీడీపీ కార్యకర్తలు వారసత్వం అని చెప్పుకునే వారికి మద్దతుగా నిలిచి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయించారు. దీంతో తహసీల్దార్ అత్యుత్సాహంతో 80 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి రిజిష్టర్ చేసిన రిజిస్ట్రేషన్ పత్రాలు చెల్లవని, అప్పటి తహసీల్దార్లు, ఆర్డీఓలు తప్పు చేశారని, వారసత్వంగా చెప్పుకునేవారికి భూములు దక్కుతాయని డిక్లేర్ చేస్తున్నట్లు బాధిత రైతులకు చెప్పాడు. దీంతో బాధిత రైతులు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావనికి మొరపెట్టుకోగా మంగళవారం రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఇరువర్గాల రికార్డులను తీసుకురమ్మనగా, రికార్డులు కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. దీంతో ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

భూసేకరణలో బాధిత రైతులకే పరిహారం

గతంలో నడికుడి–బీవీనగర్ రైల్వేలైన్, గాలిపాళెం రోడ్డు, తెలుగుగంగ కాలువ, జాతీయ రహదారి నిర్మాణాలకు సర్వేనంబర్ 98–సీలోని భూములను సేకరించారు. ప్రస్తుతం సాగుచేసుకుంటున్న రైతులకే అవార్డును ప్రకటించి నష్టపరిహారం సైతం చెల్లించారు. ఈ భూములు తమవి కాబట్టే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి భూసేకరణ చేసిందని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

భూమి విలువ పెరగడంతోనే...

80 ఏళ్ల క్రితం రైతులు రూ.30 నుంచి రూ.280 వరకు వెచ్చించి భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారి కుటుంబీకులు భూములను అనుభవిస్తున్నారు. అయితే ఇటీవల భూముల ధరలకు రెక్కలు వచ్చి ఎకరా సుమారు రూ.15 కోట్లకుపైగా పలుకుతుండడంతో మండల టీడీపీ నాయకుడు కొందరు అధికారులకు సైతం కమీషన్ ఇస్తామని ప్రలోభపెట్టి వారసత్వంగా కొందరిని రంగంలోకి దింపారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. హైకోర్టులో కేసు నడుస్తుండగా, ఇప్పుడు వివాదానికి దిగడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

నా తండ్రి కొన్నాడు



ఈశ్వరయ్య వద్ద నా తండ్రి భూమి కొనుగోలు చేశాడు. నాకు తెలిసినప్పటి నుంచి సాగుచేసుకుంటున్నాం. 1974లో వెంకటగిరి ఆర్డీఓ పట్టాలు ఇచ్చారు. ఇప్పటికీ మా ఆధీనంలోనే ఉన్నాయి. వారసత్వం అని చెప్పుకుంటూ కొందరు భూముల కోసం రావడం మంచిదికాదు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

– మస్తాన్‌రెడ్డి, ఎన్వీకండ్రి

పత్రాలన్నీ ఉన్నాయి



80 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూములను రెండు తరాలకుపైగా సాగుచేసుకుంటున్నారు. ఇప్పుడు కొత్తగా కొందరు వచ్చి ఎలాంటి రుజువు పత్రాలు లేకుండానే భూములు తమకు చెందుతాయని చెప్పడం అన్యాయం. గతంలో కొందరు ప్రభుత్వ అధికారులు ప్రలోభాలకు గురై దొంగ పట్టాలు సృష్టించి ఇబ్బందులు పడ్డారు. అయినా మళ్లీ కొందరు ఇలాంటి ప్రయత్నాలు చేయడం సరైంది కాదు.

– తెల్ల శేఖర్‌రెడ్డి, ఎన్వీకండ్రిక

బెదిరించడం సరికాదు



మా పెద్దలు కొనుగోలు చేసి ఇచ్చిన భూములను కొన్ని దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నాం. కొందరి ఆరోపణలను విన్న తహసీల్దార్ తమ వద్ద ఉన్న పాసుపుస్తకాలను చూసి హేళనగా మాట్లాడారు. పాసుపుస్తకాలను ఎవరైనా సృష్టిస్తారని, వాటిని రద్దు చేసి వారసత్వం వారికి పట్టాలు ఇస్తానని బెదిరిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు చూసి మాకు న్యాయం చేయాలి.

– చంద్రశేఖర్, గాలిపాళెం